# కుట్ర

ట్రిక్....టిక్....టిక్....

అది గోడ గడియారపు మూలుగు కాదు. ఆఫ్‌కోర్స్ అదీ గోల పెడుతోన్నా అదింత గట్టిగా కొట్టుకుంటూ ఏడవటం లేదు.

మరి ?

అదీ అక్కడ చేరిన యువతీ యువకుల గుండెల చప్పుళ్ళు! వాళ్ళ గుండెల్లో అలలు అలలుగా అనంతంగా లేచి పడుతూ మళ్ళీ లేచి మళ్ళీ పడుతోన్న ఆశా నిరాశా తరంగాల హోరు! ఘోష ! !

ఆ అందమైన హాలులో అంతకంటే ఆనందకరంగా వున్న ఫర్నిచర్ మధ్య వయ్యారంగా రెండు ఫాన్‌లు తిరుగుతున్నా అక్కడ గాలిలేదు. అవును మరి — వున్న గాలినంతా పీల్చేస్తున్నారు తప్ప ఒక్కళ్లూ బయటికి విడవడం లేదాయె!

ఇంతకీ ఎవళ్లు వాళ్లు ?

ఎడ్రస్సుల్లేని మనుషులు ! వెలగని గుడ్డి దీపాలు! ఉప్పు సముద్రంలో కలిసి పోతున్న జీవనదులు ! అమావాస్యనాటి చుక్కలు ! తెగి ముక్కలై దూరంగా పడ్డ వీణ తీగలు ! చెల్లా చెదురైన తెలుగు అక్షర మాలలోని అక్షర కన్నెలు !

వాళ్లకీ సభ్య సమాజం పెట్టిన ముద్దు పేరు చదువుకున్న నిరుద్యోగులు !

టక్....టక్....టక్....

అది బిజీగా లేకపోయినా బిజీగా వున్నట్టుండి అప్పుడప్పుడు అలసినట్లు అరమోడ్పు కన్నులతో చూసి అలవోకగా హాయిగా వోరగా నవ్వీ నవ్వనట్టుగా నవ్వే రిసెప్షనిస్ట్ చేతివ్రేళ్ల టైప్‌మిషన్ కీ బోర్డు మీదనాట్యం చేస్తోంటే వినవస్తోన్న శబ్దం కాదు.

అలా అని అసలు శబ్దం రావడం లేదని కాదు గాని ఆ శబ్దాన్ని మించిపోయి క్రైమ్ థ్రిల్లర్ సినిమాలో హఠాత్తుగా నిశ్శబ్దానంతరం వినవచ్చే బ్రహ్మాండం బ్రద్దలవుతుందేమో అన్పించేంత ధ్వని ఎక్కడెక్కడ్నుంచో వచ్చి ఆ యువతీ యువకుల కర్ణపుటాల్లోంచి గుండెల్లోకి ప్రవేశించి పెద్దగా ప్రతిధ్వనిస్తోంటే ఆ గుండెలు పడుతోన్న భయం నీడలే ఆ శబ్దాలు !

ఆ భయం ఈనాటిది కాదు. పట్టాలు పుచ్చుకున్నప్పట్నుంచీ వెంటాడుతోన్న భయం ! బ్రతుకు బాట నిండా స్వార్థపు ముళ్ల పొదలు పొంచి వున్నవన్న నిజం గ్రహించినప్పట్నుంచీ తరుముతోన్న భయం 1 ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజిలో పేరు నమోదు చేయించుకోడానికి ఎండలో నిలబడి నిలబడి క్యూలో త్రోసుకుని త్రోసుకుని ఆఖరికెలా అయితేనేం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక తమకిచ్చిన కార్డుమీది నెంబరు చూసినప్పట్నుంచీ పగబట్టిన త్రాచల్లే వెన్నంటుతూ భయపెడుతోన్న భయం!

ఆ నిరుద్యోగుల మీద వాళ్ళు తమ తమ దరఖాస్తుల్లో పేర్కొన్న మార్కుల మీద ఆ మార్కుల చదువులు చెప్పిన కాలేజీల మీద ఆఖరికి వాళ్లకి పట్టాలిచ్చిన యూనివర్శిటీల మీద బొత్తిగా నమ్మకం లేక కాబోలు నిర్వహిస్తోన్న ఆ ఇంటర్వ్యూ కోసం అక్కడ చేరిన ఆ చకోర పక్షుల గుండెల్నిండా భయం! భయం!! భయం!!! వారి కళ్లనిండా ఆశ! ఆశ!! ఆశ!!!

ఈ క్రొత్త ఆశ ఆయుష్షు ఎంతన్న ప్రశ్న వదిలేసి అసలెప్పుడు వూపిరిపోసుకుందో చూద్దాం.

కావలెను....కావలెను....కావలెను....

ఓ పెద్ద కంపెనీలో వున్న చాలా గుమస్తా ఖాళీలు భర్తీ చేయుటకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

విద్యార్హత : గుర్తించబడిన యూనివర్శిటీ డిగ్రీ లేదా దాని సమానార్హత.

కోరదగినవి : టైపు హయ్యర్ షార్ట్‌హేండ్ లోయర్ నందు వుత్తీర్ణత.

వయస్సు : 30 సంవత్సరములలోపు

అనుభవము : అనుభవమూ అధిక విద్యార్హత గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆకర్షణీయమైన జీతమూ ఇతర అలవెన్సులూ, మెడికల్ లీవ్ ట్రావెల్ వగైరా సౌకర్యాలు గల ఈ పోష్టులకు దరఖాస్తు చేయువారు తమ బయోడేటాతో బాటు ఎ.బి సి. ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట తీసిన 25 రూపాయల బ్యాంకు డ్రాఫ్టును జత పరచి ఈ నెలాఖరు లోగా పంపించవలెను.

పోస్ట్ బాక్స్ నెం. 12345
హైదరాబాద్

ముఖ్య గమనిక : సిఫార్సులు అనర్హతగా గుర్తించబడును.
డ్రాఫ్టును జతపరచని దరఖాస్తులు పరిశీలింపబడవు"

సైలెన్స్....సైలెన్స్....సైలెన్స్....

ఏం ? ఏం జరిగింది ?

సుబ్బారావు తన నలిగిన జేబురుమాలతో వాడిన మొఖాన్ని తుడుచుకుంటున్నాడు. గట్టిగా తుడిస్తే కొండలు బ్రద్దలవుతాయని భయమో ఏమో మరి అతి జాగ్రత్తగా నెమ్మదిగా తుడుచుకుంటున్నాడు.

అతడ్ని చూడగానే అతడి వయస్సెంతుంటుంది? అతడు నవ్వితే బుగ్గన సొట్ట పడుతుందా? అతడి క్రాపు ఏ హీరో పెట్టుకునే విగ్గులా వుంటుంది ? — లాంటి ప్రశ్నలు ఉదయించవ్. అవును మరి- అతడు ఆరడుగుల ఎత్తూ కోరమీసం టెర్లిన్ సూట్ ఇంపాలా కారూ వీటన్నిట్నీ మించి పేద పిల్లని అమాంతం ప్రేమించెయ్యగల గొప్ప అందమైన మనస్సూగల రచయిత్రుల నవలా హీరో కాదతడు.

అతడు సామాన్యుడు. అతడి వెనుక మణులూ, మాన్యాలూ అప్పే అస్సల్లేవు. ఓ పెద్ద ఆఫీసులో చిన్న గుమాస్తాగిరి వెలగబెడుతోన్న ఓ మధ్యతరగతి మందహాసపు పెద్ద కొడుకీ సుబ్బారావు !

పేపర్లో పడ్డ ప్రతి ప్రకటనకి అప్లై చెయ్యడానికీ పోష్టు ఖర్చులకీ పోష్టల్ ఆర్డర్లకీ సతమతమయ్యే తానెలా సంపాదించాడా పాతిక రూపాయలు ?

తల్లి మెడలో మిగిలిన పసుపుతాడుని కరచి పెట్టుకునున్న చిన్నెత్తు బంగారాన్ని తాకట్టు పెట్టాడు !

ఏమైతేనేంలే ఈ ఉద్యోగం తనకే వస్తే తన కష్టాలన్నీ మంత్రించి నట్టు తీరిపోతే ఎంత బావుణ్ను ? !

ష్.....ష్.....ష్.....

గాలి ఆడక కాదు వూపిరందక. అవును - ఆ వూపిరందనివిడ పేరు భారతి,

భారతి భారతంలా వుండదు గాని భారతదేశంలా వుంటుంది.

కన్నవాళ్ళ కాటి కెళ్తే తోడబుట్టిన వారి పంచన చేరి వదినెల కసుర్లూ సోదరుల విసుర్లూ భరిస్తూ ఉద్యోగం వస్తే గుండెల్నిండా వూపిరి పీల్చుకోవచ్చని చూస్తోంది భారతి.

ఒంటి మీద ఆభరణాల మాటలా వుంచి పూసలదండైనా లేదు. ఒంటి మీదున్న దుస్తులూ ప్చ— సాదాసీదావి. కళ్ల మాత్రం చక్రాల్లా వున్నాయి. అవెన్నెన్ని కమ్మని కలలు కంటూంటాయో! పోదూ- అనుక్షణం తుమ్మ ముళ్ల సూటిగా గుండెల్లో గునపాల్లా గ్రుచ్చుకొంటోంటే ఆ కళ్ల కలలే కంటాయా? కన్నీళ్లే కారుస్తాయూ? -

అవును—తిండికీ బట్టకే గాక దరఖాస్తులకి డబ్బుకూడా మేం ఎక్కడ్నుంచి తేమని ఇంట్లో వాళ్ల సణుక్కుంటే మరాడబ్బెక్కడ్నుంచొచ్చిందబ్బా?

అవును- అతను—ఇంటి ప్రక్కతను? అతనే—అస్తమానూ నీ వంక చూస్తూంటాడు? ఆ( అతనే ఒకోసారి అదోలా నవ్వుతుంటాడు? అబ్బా! అతనే. గత్యంతరం లేక చాలా ఖాళీలున్నా యంటున్నారు కదా అని చెప్పి ఏమనుకుంటే అనుకోని అని ఏమైతే అవ్వనీ అని అడిగేసింది. డబ్బందగానే ఇంకో పదేసి అప్పు తీర్చెయ్యదూ?

కనీసం అందుకోనమైనా ఈ ఉద్యోగం తప్పకుండా తనకే వస్తే ఎంత బావుణ్ణెంత బావుణ్ణు!

.... .... .... ....

ఇదేమిటి ?

ఇది మాటలు రాని పక్షి ఆవేదన!

అది ఆ మూల బిక్కు బిక్కుమంటూ కూర్చున రాజన్న గొంతులో సుళ్ళు తిరుగుతోన్న మూగ బాధ!

ఇప్పుడే కాదు అతడెప్పుడూ ఒంటరే. చిన్నప్పుడు 'హరిజనుడు-దూరంగా వుండాలి' అని వుంచితే, పెద్దయ్యాక 'ఏదు రిజర్వేషన్ల గాడు-ఫెయిలైనా డిగ్రీ లిస్తారు' అంటూ వెలేస్తే ఒంటిగా ఒంటరిగా పెరిగిన వాడు!

ఆ గేలిచేసేవాళ్లకి "వలకాలేదు బలపం లేదు గానొరేయ్ పేడ తియ్యి" అని చిన్నప్పుడు తండ్రి కేకలేస్తే ఎంత ఏడ్చాడో, "బోల్డు డబ్బోసి ఎక్కడ సదివించగలంరా. ఆ సదువులు గొప్పోరికి సెల్లుద్దిగాని మనలాంటోళ్లకొక్కడు. పన్లో కెల్రా—పెద కాపుగారు నిన్ను చిన్న పాలేరుగా ఎట్టుకుంటానన్నారు" అని తల్లి అన్నప్పుడెంత కుమిలి పోయాడో, రోజూ తల్లీ వీలున్నప్పుడు తనూ కూలి చేసి తినీ తినక చదివినప్పుడెంత నరకం అనుభవించాడో చెప్పాలనిపించినా చెప్పలేక లోలోపలే దాచేసుకున్నాడు. తన కంఠంలోనే గరళాన్ని బంధించేసు కున్నాడు.

డిగ్రీ పాసై రెండేళ్లయింది. ఏ ఉద్యోగమూ అతడ్ని చూసి నవ్వ లేదు. కనీసం ఇదైనా కరుణిస్తుందన్న కొండంత ఆశతో పదిరోజులు తల్లికి తెలియకుండా రాత్రిళ్ళు మిల్లులో పనిచేసి పాతికా కూడ బెట్టి అప్లి కేషన్ ఫీజుగా పంపాడు.

అయినా ఇంటర్వ్యూకి ఎక్కడో గోదావరి జిల్లాలోని కుగ్రామం నుంచి హైదరాబాద్ రావడానికి డబ్బులేక వారపు వడ్డీకి సొమ్ము తెచ్చుకు నొచ్చాడు!

తన కోసం గాకపోయినా తన సంపాదనతో తన బ్రతుకుని ముడి బెట్టుకున్న ఆ ముసలి తల్లి కోసమైనా ఈ ఉద్యోగం తప్పకుండా తనకే వస్తే ఎంత బావుణ్ను!

టక్....టక్....టక్....

అది సందేహం లేదు కొత్త బూట్ల చప్పుడే.

ఆ బూట్లు తొడుక్కొన్న యువకుడు నల్లని టెరికాటన్ పాంట్లో నల్లని డిజైన్లున్న తెల్లని పాలిస్టర్ షర్ట్‌ని ఇన్‌షర్ట్ చేసి బెల్టుతో బిగించాడు. అతడి కళ్లకి కూలింగ్ గ్లాసెస్ అందం తెస్తే తలమీద వంకీల జుట్టు చిలిపి నవ్వులు కుమ్మరిస్తోంది. చొక్కా జేబులోంచి నాలుగు కొత్త వందనోట్లు ఠీవిగా చూస్తున్నాయ్.

చుట్టూ చూశాడు విసుగ్గా అసహనంగా. ఆ తర్వాత రిసెప్షనిస్టని చూశాడు. చూసీ చూడగానే చిన్నగా ఈల వేసి వెళ్లి ఆమెని విష్ చేశాడు.

"హాలో. అయామె రెలటివ్ ఆఫ్ మిస్టర్ యమ్మార్ దాస్ ఒన్ ఆఫ్‌ద డైరెక్టర్స్ ఆఫ్ దిస్ కంపెనీ...."

అంత పెద్దావిడా గాభరాపడిపోయి ఓ కుర్చీ ప్రక్కకి లాగి కూర్చోమంది. అప్పుడే కొత్తగా జాయినైన ఆఫీసర్లా కూర్చొని ఆమెని కబుర్లలోకి దింపాడు.

అంతా ఈర్ష్యగా అనుమానంగా చూడసాగారతడి వంక —వీడికో పోస్ట్ ఖాయం కాబోలనుకుంటూ.

"అసల్నేనీ బ్లడీపోస్టుకి రాకపోదునండీ. కాని మా అంకుల్‌-దాస్‌గారు నాకు అంకులవుతార్లెండి—ఏదో జాయినై అన్ని పట్లూ నేర్చుకోగానే టాప్‌కి లాగేస్తామని హామీ ఇస్తేనూ సరేలే కాలక్షేపం కూడా కదాని వచ్చాను. వచ్చేక మిమ్మల్ని చూశాక మీలాంటి వారు స్టాఫ్‌లో వున్నారని ప్రత్యక్షంగా చూశాక తప్పకుండా ఈ కంపెనీలో జాబ్ చెయ్యాలని నిర్ణయిం చేసుకున్నాను."

ఎవర్నో వుద్ధరించేస్తున్నట్టుగా నవ్వాడతను.

సుతారంగా సితార మీటినట్టు నవ్వింది రిసెప్షనిస్టు.

ఒకటి—రెండు—మూడు—

లెక్కలు కావు అంకెల పాఠమూ కాదు.

జనం !

ఇంటర్వ్యూకొచ్చిన నిరుద్యోగుల సంఖ్య వందా పాతిక దాటుతోందప్పుడే. హాలులో నిలబట్టానికి కూడా ఖాళీలేదు. ఇంటర్వ్యూకెంత మందిని పిల్చారో ఏమో గాని జనం తీర్థప్రజల్లా ఇంకా వస్తూనే వున్నారు.

"పాతిక రూపాయలు ఫీజు కట్టించుకొని కనీసం కూర్చోడానికైనా కుర్చీలు వేయించలేదు చూడు." ఒకతనన్నాడు నిలబడి విసిగి విసిగి.

"అసలందర్నీ ఇవాళే పిలవకపోతే రేపు కొందర్నీ ఎల్లుండు కొందర్నీ పిలవాల్సింది" ఇంకో అతనన్నాడు.

"రేపూ ఎల్లుండూ కూడా ఇంటర్వ్యూలున్నాయిట. పైగా దరఖాస్తులు చాలానే వచ్చాయిటగాని నాలుగువందల మందినే ఇంటర్వ్యూకి పిలిచారట" చావు కబురు చల్లగా చెప్పేడింకొకడు.

మాటామంతీ కట్టి పెట్టేసి గబుక్కున అతడివంక చూసి చూపులు దించుకున్నారంతా. వారి చూపుల్లో నీరసం కన్పిస్తోంది. నిరాశతాలూకు నీలి నీడలు కదలాడుతున్నాయ్ !

"ఏదో ఇంటర్వ్యూకి పిలిచారు కదా డిగ్రీలో ఫస్టుక్లాస్ వచ్చింది. కదాని ఎక్కడో పై జాగ్ నుంచి వచ్చాడుతను. చూస్తోంటే అంతామాయా ప్రపంచంలా వుంది—" ఇది ఒక అభ్యర్థి స్వగతం.

"ఇంటర్వ్యూ ఎనిమిదింటికన్నారు. ఇప్పుడు పదవుతోన్నా మన అతీ గతీ చూసే వాళ్లేలేరు" ఒకత నన్నాడు కోపంగా విసురుగా గట్టిగా

"మా బాగా అన్నావ్" అని ప్రశంసాపూర్వకంగా చూసి అక్కడున్న కంపెనీకి చెందిన ఒకే ఒక మనిషి రిసెప్షనిస్టు ఏమంటుందో అని ఆమె వైపు చూశారంతా.

వాళ్ళనెక్కడ కూర్చో మనాలో ఎలా సర్దుబాటు చెయ్యాలో తెలీక వాళ్ళనలా వదిలెయ్యడమే మంచిదని తీర్మానించుకుని వాళ్ళవైపు చూడ్డం మానేసి దాస్‌గారి చుట్టంతో కబుర్లలో పడిపోయిందావిడ.

ఇది ఇండియా అనీ ఇక్కడ పంక్చువాలిటీ అంటే ప్రకటించిన టైముకి మినిమమ్ మూడు గంట లాలస్యంగా మొదలుపెట్టడమని తెలీని సూర్యారావు పురప్ సూర్యుడుగారు గబగబా డ్యూటీలో జాయినై పోయి తన సప్తాశ్వరథాన్ని ఆకాశంలో పరుగులు తీయించేస్తున్నాడు. దాంతో హాల్లో ఖాళీ లేక బయట నిలబడ్డ నిరుద్యోగులు ఎండకి తాళలేక కొందరు దగ్గర్లోని కాకాహోటల్స్‌లో సర్దుకుంటే మరి కొందరు తాజావార్తా విశేషాల కోసమని కొన్న వార్తా పత్రికలని టెంపరరీ గొడుగుల క్రింద మార్చేసుకున్నారు.

ట్రింగ్-ట్రింగ్-ట్రింగ్-

కరక్ట్. అది ఫోన్ గుక్కపెట్టి ఏడ్చిన ఏడ్పే.

వులిక్కిపడ్డారంతా. గొప్పవారి రాచకార్యాలను తన భుజం మీద వేసుకుని చక్కగా గౌరవపూర్వకంగా ఒబీడియంట్ సర్వెంట్లా నిర్వర్తించే ఫోనులంటే పాపం ఆ నిర్భాగ్యులకి భయం. అందుకే అంతా ఊపిరి బిగబట్టి చెవులటు అప్పగించారు.

"హలో" చాలా అందంగా అంది రిసెప్షనిస్ట్. కాని ఆమె దురదృష్టవశాత్తూ ఆ విషయం గుర్తించే స్థితిలో లేరు చుట్టూ వున్నవాళ్ళు.

"ఎవరండీ ? మంత్రిగారి పియ్యేగారాండీ—గుడ్ మార్నింగ్ సార్-వాట్సార్-అవున్సార్-ఇంటర్వ్యూలింకా మొదలవ్వలేద్సార్-యం. డీ గారింకా రాలేద్సార్-యస్సార్-నేమ్ సార్-యస్సార్-చెబుతాన్సార్—నోట్ చేసుకున్నాన్సార్—నమస్తేసార్-థాంక్యూసార్—"

రిసీవర్ పెట్టేసి ఓ స్లిప్ మీద ఏదో గీకేసి "మేనేజింగ్ డైరెక్టర్" అని బోర్డున్న రూములో కెళ్ళి టేబుల్ మీద పేపర్ వెయిట్ క్రింద పెట్టి

వచ్చి తన సీట్లో కూర్చుంటూ దాస్‌గారి బంధువు వంక చూసి నవ్వి హేండ్ బేగ్‌లోంచి సెంటెడ్ కర్చీఫ్ తీసి ముఖం అద్దుకోసాగింది.

"ఇంకో పోస్టుని మంత్రిగారు తన్నుకుపోయారు!" అను కున్నారంతా-అనుమానించినంతా అయ్యిందని విట్టూరుస్తూ.

"అక్కడ రిసెప్షనిస్ట్ దగ్గర కూర్చున్నతనికి ఒకటీ మంత్రిగారి కేండిడేట్‌కి ఒకటీ పోతే ఇక మిగిలినవి ఎన్నిట?" స్టేటిస్టిక్స్‌లో డిగ్రీ తీసుకున్నత నడిగాడు ప్రక్కతన్ని.

"మంత్రిగారి కేండిడేట్స్ ఒక్కళ్ళే అని గ్యారంటీ ఏమిటి?" సైకాలజీ చదివినతను నిగ్గదీశాడు.

"అసలున్న పోస్టు లెన్ని భర్తీ చేస్తున్న వెన్ని?" ఇది సైన్స్ గ్రాడ్యుయేట్ వేసిన ప్రశ్న.

"చాలా పోస్టులున్నాయని ఎడ్వర్ టైజ్ మెంట్లో పేర్కొన్నారు మరి" అని అమాయకంగా బి. ఏ. తెలుగు లిట్ అంటే, "అయితే పోస్టుల సంఖ్య యక్స్ అన్నమాట" అన్నాడు మేథ్స్ గ్రాడ్యుయేట్.

అంతా అతడి వంక యక్స్ చూపులు చూశారు!

బర్ ర్ ర్........

పెద్దగా శబ్దం చెయ్యకుండా వచ్చి అగిందా ఆఫీసుముందో చిన్న పొడుగాటి కారు.

అంతవరకూ ఏదేదో మాట్లాడేసుకున్న వాళ్ళంతా నిశ్శబ్దమై పోయారొక్కసారే.

కార్లోంచి ఫుల్ సూట్‌లో వున్న ఓ యాభై ఏళ్ళాయన దిగాడు. ఆయనే ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్. తలమీద వెంట్రుకలు రెండే గాని తలలో ఆలోచనలు మాత్రం లెక్కకు మించి వున్నాయి.

అందుకు ప్రత్యక్షవుదాహరణ ఆయన కెరీర్ గ్రాఫ్.

సెక్రటేరియట్లో 'ఏదో' జాబ్ చేసేవాడల్లా వాళ్ల కులస్తుడు మంత్రి అవడంతో ఆయన పి. ఏ. గా అవతారం దాల్చి ఆయన్ని రెండు కుంభ

కోణాల్లోంచి రక్షించి ఓ గవర్నమెంట్ అండర్ టేకింగ్లో పెద్ద పొజి షన్లో కెళ్ళిపడి అక్కడ రెండు చేతులా సంపాదించుకుని ఈ కంపెనీకి యమ్. డీ. గానూ మేజర్ షేర్ హోల్డర్ గానూ వచ్చాడు.

ఆయన వెంట వచ్చిన ముసలాయన పేరు హరిశ్చంద్రరావుగారు. ఆయనో కోటీశ్వరుడు. ఈ కంపెనీలో ప్రముఖ వాటాదారుడే కాదు ఆయన కింకా చాలా పరిశ్రమలున్నాయ్.

ఆయన దొంగ కరెన్సీ ముద్రించి పెద్దవాడయ్యాడని ఓ టైమ్లో పెద్ద గొడవొచ్చింది గాని అదేం ఋజువుకాలేదు. కాదంటే ఆ సందర్భం లోనే ఆయన అనుచరులో ఇద్దరు అర్ధాంతరంగా చనిపోయారు. అప్పుడా యన వారి కుటుంబాలకి రెండేసి వేలిచ్చినట్లు పేపర్లు ఘనంగా రాశాయి కూడానూ.

ఆ విషయాలొదిలేస్తే ఆయన ఖరీదైన ఖద్దరు లాల్చీ పంచె ధరిం చారు. దబ్బపండు రంగులో మెరిసిపోతూ భుజాల మీద ఆకుపచ్చని కాశ్మీర్ సిల్కు శాలువా కప్పుకుని వెండి మొనవున్న చేతికర్రని పట్టు కున్నారు. ఆయన పెద్ద భక్తుడు కూడా. అందుకు ప్రత్యక్ష నిదర్శనం ఆయన మెళ్ళో వ్రేలాడుతోన్న అలివేలు సహితుడైన బంగారు వేంకటే శ్వరస్వామే!

వారి వెంట ఇంకో ఆయన దిగారు. ఆయన ఓ లోకల్ కాలేజీ ప్రిన్సిపాల్. ఇంటర్వ్యూలో సాయం కోసం పిల్చారు.

వాళ్ళు ముగ్గురూ అందర్నీ పరిశీలిస్తూ లోపలి కెళ్తూంటే అంతా వినయంగా నిలబడ్డారు. కొందరు నమస్కారాలు పెట్టారు. వాళ్ళని చూసి మిగిలిన వాళ్ళు అదే పని చేశారు.

అందరికీ తల వూపుతో సమాధానమిచ్చి యమ్.డీ. గారి రూములో కెళ్ళారు.

కంగారు....భయం....దడ....
మాస్హిస్టీరియా వచ్చేసిందందరికీ.

ఇంకా స్పేపర్లో ఇంటర్వ్యూ మొదలవుతుందని తెలుసు గనుక గబగబా ఖరీదెక్కువా సరుకు తక్కువా వుండే జనరల్‌నాలెడ్జి పుస్తకాలని రిఫర్ చేస్తున్నారు కొందరు. ఇంకొందరు తాము చదివిన డిగ్రీ కోర్సులోని ప్రశ్నలేస్తారేమోనని ఆ పుస్తకాలు తిరగేస్తున్నారు. మరికొందరు అవాళ్టి పేపర్లోని విషయాలేమిటని అడుగుతారేమోనని పేపరు ఆమూలాగ్రం మళ్ళీ మళ్ళీ చదివేస్తున్నారు.

ఇంతలో ఎవరికో అనుమానం వచ్చింది "మన ఆర్థిక మంత్రి ఎవరండీ?" అని అడిగేడు ప్రక్కతన్ని.

"మంత్రుల పేర్లు కూడా అడుగుతారు కదూ" అనుకుంటూ 'హూ ఈజ్ హూ' బుక్ లెట్ తీశాడు ప్రక్కతను.

"ఇరవై సూత్రాలూ ఏవిటండీ. ఓసారి చెబుతారా?" ఒకామె అడిగింది ఇంతేసి దళసరి కళ్ళద్దాలు పెట్టుకున్న కుర్రాడ్ని.

అతడు చెప్పేలోపునే "వాటి గురించడగరండీ" అన్నాడొకతను.

"ఏమో ఏం చెప్పగలం ?" ఇంటర్వ్యూలో ఏమైనా అడగొచ్చు. పైగా వీళ్ల కాంగ్రెస్ సపోర్టర్స్ అయినా అవ్వొచ్చు కదా" ఇంకో అతనన్నాడు.

దాంతో మళ్ళీ ఆ విషయాలు రిఫర్ చేస్తోంటే "అసలీ పోస్టుకి జీతాలెంతో మీకు తెలుసా ?" ఇంకో కంపెనీలో నూటయాభై రూపాయలకి పనిచేస్తున్న ఒకతనడిగాడు.

"తెలీదు కానండి నాలుగొందల రూపాయలు పైనే వుంటుందనుకుంటాను"

ఆ మాటలు అందరి చెవుల్లోనూ పడ్డాయి.

"నాలుగొందలైతే క్లాసైన జాబే. అయితే తప్పకుండా తనకే వస్తే బావుణ్ణు" అని ఎవరికి వాళ్ళే అనుకున్నారు. కొందరేమవుతుందోనని ఆందోళన పడుతుంటే దేవుళ్ళకి మొక్కసాగారు మరికొందరు.

కి ర్ ర్ ర్....

స్ప్రింగ్ డోరోసారి ఆవలించి మళ్ళీ మూసుకుంది.

లోపల్నుంచో పెద్దలిస్టుతో వచ్చింది రిసెప్షనిస్ట్. ఓ పేరు పిలిచి ఆ పేరుగలతన్ని లోపలికెళ్ళమంది. అతడెళ్ళేక మరో పదిపేర్లు పిలిచి గుమ్మానికి కాస్త ఎడంగా హ్యాలో నిల్చోమంది. నిల్చున్నారు.

వాళ్ళు సరిగ్గానే నుంచున్నా "మరి కొంచెం దూరంగా వుండండి. తోసుకోకండి. గొడవ చెయ్యకండి. అయ్యగారు కోప్పడతారు" అంటు న్నాడు డోర్ ప్రక్కన స్టూల్ మీద కూర్చున్న ప్యూను!

"అఖరికి వీడిక్కూడా లోకువే కదా మా బతుకులు! ఎంత చదివి తేనేం ఎన్ని డిగ్రీలుంటేనేం నిరుద్యోగి అంటే రోడ్లంట బలాదూర్ తిరిగే వెధవక్కూడా లోకువే!" అనుకుంటూ నిట్టూరుస్తూ నిలబడ్డారు.

లోపలి కెళ్ళినతను వచ్చాడు చెమట్లు తుడుచుకుంటూ. అంతా అత గాడ్ని చుట్టుముట్టేశారు.

"ఏమేం ప్రశ్నలడిగారు ?"

"మంత్రుల పేర్లడిగారా ?"

"ఇండియా విషయాలే అడిగారా ? వరల్డ్ టాపిక్స్ కూడా టచ్ చేశారా ?"

"ఇంగ్లీషులో అడిగారా ? తెలుగులో అడిగారా ?"

"దేవ్వేం అడగలేదు కదా ?"

"సబ్జక్ట్ మేటరడిగారా ?"

"మీరన్నిటికీ జవాబులు చెప్పేరా ?"

ఎన్నో ప్రశ్నలొచ్చి పడ్డాయ్. ఒక్కొక్కళ్ళు నాలుగేసి ప్రశ్న లడుగుతోంటే ఇబ్బందిగా ఫీలయ్యాడతడు. అది గమనించి సైలెంటై పోయారంతా.

"ఢిల్లీలో కాలనాళిక పాతిపెట్టిన తారీకేమిటి ? ఉగాండా రాజధాని పేరేమిటి ? ఈ సంవత్సరం జ్ఞానపీఠ్ అవార్డ్ పొందిన రచయిత ఎవరు? సి.ఐ.ఐ.బి. అంటే ఏమిటి ? హాకీ టీమ్‌లో ఎంతమంది ఆట గాళ్ళుంటారు ?"

పుక్కిరి బిక్కిరయ్యారంతా. ఆ వుత్తర క్షణాన నోటి తడారి పోతుంటే తెల్లమొహాలేసుకుని గుడ్లప్పగించి చూస్తూండిపోయారు.

"పెర్సనల్ విషయాలేం అడగలేదా గురూ ?" ఓ కుర్రాడడిగాడు.

"అడిగారు. నువ్వెందుకిన్నాళ్ళు నిరుద్యోగిగా వున్నావ్ ? నువ్వీ జాబ్‌కే ఎందుకొచ్చావ్? నీ కెంత జీతం కావాలి ? ఆరునెలలు ప్రొబేషన్ పిరియడ్. ఆ తర్వాత నీ వర్క్ బావుంటేనే పర్మనెంట్ చేస్తాం. అందు కిష్టమేనా ?"

"బావుంది. మనం విసిరిన పది రాళ్లలో ఇదొకటి గనుక వచ్చేం" అని ఒకరన్నారు. "మనం ఇన్నాళ్ళు ఎందుకు నిరుద్యోగులుగా పడి వున్నామన్నది ప్రభుత్వాన్నడగాల్సిన ప్రశ్న" అని వ్యాఖ్యానించా రొకరు.

"అసలు వాళ్ళడుగుతున్న ప్రశ్నలకీ వాళ్ళిచ్చే గుమాస్తా ఉద్యోగానికీ సంబంధం ఏమిటి ?" మరొకరు తమ ధర్మ సందేహాన్ని వెలి బుచ్చారు గాని సమాధానం ఎవరికీ తోచలేదు.

అవును మరి. అదీ మిలియన్ డాలర్ల క్వశ్చన్! మేధావులు జవాబు చెప్పడానికి ప్రయత్నిస్తే బావుణ్ణు!

బ్రేక్....టీ బ్రేక్....

అదిరి పడ్డారంతా.

"ఇంటర్వ్యూ మొదలై గంటవ్వలేదు. పదిమందిని ఇంటర్వ్యూ చెయ్యలేదు. అప్పుడే టీ బ్రేకా ? ఈ లెక్కన అందర్నీ ఎప్పటికి ఇంటర్వ్యూ చేస్తారు?" ఒకతనన్నాడు గట్టిగా.

ప్రొద్దున్ననగా వచ్చాం. ఆకల్తో ఛస్తున్నాం" మరో గొంతు లేచింది.

రిసెప్షనిస్ట్ ప్యూన్‌తో ఏదో చెప్పింది.

అతడు "గొడవ చెయ్యకండి. అయ్యగారు కోప్పడతారు" అని హెచ్చరించి లోపలికి ఫ్లాస్కు పట్టుకెళ్ళాడు.

"బయట ఎండలో మాడి పోతున్నాం. మాకు నిలబట్టానికైనా చోటిప్పించండి" ఎండకి ఎండి వాడిన ఒకతను మండిపడ్డాడు.

ఇంకొకళ్ళింకేదో అన్నారు.

వాతావరణం మెల్లగా మారిపోతోంది.

ఏదో జరక్కూడనిది జరగబోతోందని అందరికీ భయంగా వుంది. ఎంతో దూరాన్నుండి ఎంతో డబ్బు ఖర్చు పెట్టుకునొచ్చాం-ఇంటర్వ్యూ కేన్సిల్ చెప్తారేమోనని ఇదై పోతున్నారు. 'వీళ్ళ గురించి మనం చెడా లేమో' అని ఆదోరకంగా ఆ అడుగుతున్న వాళ్ల వంక చూశారు లోలోపల వాళ్లంటున్నదీ నిజమే అన్పించినా.

మెల్లగా పరిస్థితి తర్జన భర్జనల స్థాయి దాటింది. టీ బ్రేక్ ఇచ్చి ఇరవై నిమిషాలైనా ఇంటర్వ్యూ మొదలుపెట్టక పోయేసరికి వారిలో సహనం చచ్చిపోయింది. ఆందోళన వుధృతమయ్యింది. దానికి తోడు తొలి చేస్తున్న ఆకలి! చుట్టుముట్టేస్తోన్న నిరాశ! బయట ఎండ! లోపల వుక్క

"ఇంటర్వ్యూ మొదలెట్టాలి!"

"మాకు నీడను చూపెట్టాలి!"

నినాదాలు తారస్థాయి నందుకొంటోంటే లోపల్నుంచి యమ్.డి. గారు విసురుగా వచ్చారు.

"ఏమిటీ నాన్సెన్స్ ?"

"మేం ఆకలితో మాడిపోతున్నాం సార్. త్వరగా ఇంటర్వ్యూ మొదలెట్టాల్సిందిగా కోరుతున్నాం"

"ఇంటర్వ్యూ ఎప్పుడు మొదలు పెట్టాలో మాకు తెలుసు".

"మమ్మల్ని ఎనిమిదింటికి రమ్మన్నారు. ఆదరాబాదరా పరుగెత్తు కొస్తే పదిన్నరవరకూ ఇంటర్వ్యూ మొదలే పెట్టలేదు"

"అందుకు చింతిస్తున్నాం"

"ఎండలో మాడిపోతున్నాం. మాకు నీడ చూపించండి."

"మేం చెయ్యగలిగినంతా చేశాం. ఇక ఏం చెయ్యలేం. ఎండలో నిలబడలేని వాళ్లూ ఆకలికి తాళలేనివాళ్ళూ ఇంటర్వ్యూ మొదలయ్యేవరకూ ఆగలేని వాళ్ళూ నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు. ఓర్పు సహనం లేనివాళ్ల మా కక్కర్లేదు కూడా. కాని ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. ఇక్కడుంటే మాత్రం చాలా డిసిప్లిన్డ్‌గా వుండాల్సిందే. దటీజ్ మై ఆర్డర్."

"మేం కట్టిన పాతిక రూపాయలూ ఇచ్చేయండి వెళ్లిపోతాం".

"ఆ డబ్బు వాపసు ఇవ్వబడదు"

"అన్యాయం! చచ్చిన శవాల్ని రాబందులు పీక్కు తింటే మీరు బ్రతికున్నవాళ్లనే పీక్కు తింటున్నారు...."

"డోంటాక్ రబ్బిష్! ఇంకొక మాట మాట్లాడినా ఐ విల్ నెక్ యూ అవుట్. మీ కిష్టమయ్యే డబ్బు కట్టారు. అందులో మా బలవంతం ఏమీ లేదు. ఇలా అప్లికేషన్లతో బాటు ఫీజులు మేమే కాదు చాలా కంపెనీలూ ప్రభుత్వ అండర్ టేకింగ్సూ జాతీయ బ్యాంకులూ కూడా వసూలు చేస్తున్నాయి. ఐ.ఏ.యస్. లాంటి పరీక్షల విషయంలో గవర్నమెంట్ ఇంతకంటే ఎక్కువ సొమ్మును డ్రాఫ్టులగానో, పోస్టల్ ఆర్డర్స్ రూపానో కలెక్ట్ చేస్తున్న సంగతి నేను మీకు గుర్తు చెయ్యక్కర్లేదు. మా చర్య గురించి ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చుకోవాల్సిన అవసరమూ, అగత్యమూ మాకు లేదు. బీ కామ్ అండ్ బీ కేర్‌ఫుల్. దట్సాల్...."

ఆయన లోపలికెళ్లి పోయాడు.

ఆయన చెప్పిందీ నిజమే అన్పించింది. ఎందరికో ఇలా డబ్బు కడుతూనే వున్నారు. అందులో ప్రభుత్వ సంస్థలు కూడా వున్నాయి. ఉద్యోగం చూపాల్సిన బాధ్యత గల ప్రభుత్వం ఉద్యోగాలు చూపడం పోయి ఇలా నిరుద్యోగుల్ని - బ్రతికున్న శవాల్ని - అస్థి పంజరాల్ని - పురేసుకొని వ్రేలాడుతోన్న ఆశల్ని - నిలువునా దోచేస్తే ఇక తమకి రక్షణ నిచ్చే నాధుడెవరు ? ఇక లంచాల గురించీ సిఫారసుల గురించీ బంధుప్రీతి గురించీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు.

అందరి గుండెలూ విషాదంతో బరువెక్కాయ్. ఇన్నాళ్టి నిరుద్యోగ పర్వంలోని చేదు అనుభవాలు వాళ్ల తలల్ని బలవంతంగా వంచేశాయ్. బాధ్యతలు వాళ్లని నోరు విప్పనివ్వడంలేదు. ఎక్కడో కనబడని తీరాల కావల మిణుకు మిణుకుమని వెలుగుతోన్న ఆశ వాళ్లని లోబరుచుకుంది. గట్టిగా అడిగితే వుద్యోగం ఇవ్వం పొమ్మంటే రైళ్ళ చక్రాల క్రింద తమ జీవితాల్ని పరచాలేమోనన్న భయం వాళ్లని తన గుప్పిట్లో బంధించేసింది.

మళ్లీ ఇంటర్వ్యూ మొదలయ్యింది.

* * *

కొత్త సంవత్సరారంభంలో జరిగిన ఎ.బి.సి. ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బోర్డు మీటింగులో ఆ కంపెనీ యమ్.డీ. కంపెనీ యాన్యువల్ రిపోర్టుని సమర్పిస్తూ ఇలా అన్నారు—

"....గత సంవత్సరం ఫిబ్రవరిలో మన కంపెనీలో పన్నెండు తాత్కాలిక పోస్టులకు దరఖాస్తులు కోరగా 5,432 అప్లికేషన్లు వచ్చాయి. ఒకో అప్లికేషన్‌కి 25 రూపాయలు చొప్పున మొత్తం 1,35,800 వసూలయ్యింది. అందులో 1500 రూ. ఎడ్వర్‌టైజ్‌మెంటుకి ఇంటర్వ్యూ నిర్వహించడానికీ ఖర్చు అయ్యింది. ఇకపోతే ఇంటర్వ్యూకి 500 మందిని పిలిచి పన్నెండుగురిని సెలెక్టు చేసుకుని మన కంపెనీలో టెంపరరీ బేసిస్ మీద వుద్యోగాలివ్వడం జరిగింది. వారికి ఒక్కొక్కరికి ఇచ్చిన నెల జీతం మూడువందల రూపాయలు. కానీ ఆరునెలల ప్రొబేషన్ తర్వాత వారి

5)

సర్వీసెస్ సంతృప్తికరంగా లేనందున పదకొండు మందిని తొలగించడమైనది. మిగిలిన ఒక్కర్నీ పర్మనెంట్ చెయ్యడం జరిగింది.

అప్లికేషన్ ఫీజుగా వసూలైన సొమ్ములో ఇంటర్వ్యూ తదితర ఖర్చులూ కొత్తగా నియమించిన వుద్యోగుల జీతాల ఖర్చూ పోను మిగిలిన 1,12,700 రూ.లను కంపెనీ రిజర్వు నిధికి జమ చేయడమైనది. ఇకపోతే ప్రస్తుతం ఏర్పడ్డ 11 ఖాళీలు నింపుటకు మళ్లీ దరఖాస్తులు కోరడానికి బోర్డు ఒక తీర్మానం పాస్ చేయాల్సిందిగా కోరుతున్నాను...."

ఆయన వాక్యం పూర్తవ్వకుండానే డైరెక్టర్లంతా తప్పట్లతో తమ హర్షామోదాలని తెలియజేశారు!

—0—

(ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక 22-3-79)

('వల' పేరుతో AART Hyderabad వారి ద్వారా
రేడియో నాటికగా ప్రసారితం—మే'79)